
సాక్షి మంచిర్యాల

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



గెలుపు నిర్ణేత శ్రీరాంపూర్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూని యన్ల గెలుపోటములను శ్రీరాంపూర్ ఏరియానే నిర్దేశించనుంది. ఇక్కడ ఓట్లను కైవసం చేసు కుంటేనే గెలిచే అవకాశం ఉంటుంది. 8లో▸

నేడు జెడ్పీ సమావేశం

మంచిర్యాలటౌన్: నేటి ఉదయం 10:30 గంటలకు జెడ్పీ కార్యాలయంలో జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కె. నరేం దర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నూత నంగా ఎన్నికైన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు జెడ్పీటీసీలు హాజరుకావాల్సి ఉం ది. అసెంబ్లీ సమావేశాల కోసం ఎమ్మెల్యేలు హైద రాబాద్ వెళ్లడంతో జెడ్పీ సమావేశంలో పాల్గొనడంపై సందిగ్ధత నెలకొంది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /16.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ

- కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: భారత ఎన్నికల సం ఘం ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి ఫిబ్ర వరి 8 వరకు నిర్వహించనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతం గా నిర్వహించాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ సమా వేశ మందిరంలో అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల, చెన్నూర్ ఆర్డీవోలు రాములు, సిడాం దత్తుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1 జనవరి అర్హత తేదీగా నిర్ధారించడం జరిగిం దని, ఈక్రమంలో ఈ నెల 20 నుంచి జనవరి 5 వరకు ప్రీ రివిజన్ యాక్టివిటీ, జనవరి 6 నుం చి ఫిబ్రవరి 8 వరకు రివిజన్ యాక్టివిటీగా విభ జించడం జరిగిందన్నారు. ప్రీరివిజన్ యాక్టి విటీస్‌లో పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకర ణ, ఎలక్ట్రోరల్ వ్యత్యాసాల తొలగింపు, ఓటరు జాబితాలో ఫొటోలు స్పష్టంగా కనిపించేలా చర్యలు, రివిజన్ యాక్టివిటీస్‌లో భాగంగా జన వరి 6న ముసాయిదా జాబితా ప్రచురణ, 6 నుంచి 22 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 8 న తుదిజాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: ఈ నెల 30న నిర్వహించను న్న మెగా లోక్ అదాలత్‌లో జిల్లాలో పెండింగ్ లో ఉన్న కేసులు సాధ్యమైనంత వరకు ఎక్కు వ సంఖ్యలో పరిష్కరించేందుకు కృషి చేయాల ని జిల్లా జడ్జి బోయ శ్రీనివాస్ అన్నారు. శని వారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్, ఎక్సై జ్, బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులతో పాటు న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఏళ్ల తరబడిగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చే సుకోవాలన్నారు. సంబంధిత అధికారులు, పో లీసులు కక్షిదారులను సంప్రదించి రాజీ కుది ర్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్పిత మారంరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటో యూనియన్ల నిరసనలు



మాట్లాడుతున్న బీఎంఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ లకు ఉచిత బస్సు ప్రయణానికి అమలు చేస్తు న్న మహాలక్ష్మి పథకాన్ని వ్యతిరేకిస్తూ అన్ని మండలాల్లో దశలవారీగా నిరసన కార్యక్రమా లు చేపట్టనున్నట్లు బీఎంఎస్ నాయకులు తెలి పారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆటోడ్రైవర్లతో కలిసి ఏర్పాటు చేసిన సమావే శంలో బీఎంఎస్ నాయకులు తీర్మానం చేశారు. 17న ఎమ్మెల్యేలకు వినతిపత్రం, 18న తహసీ ల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా, వినతిప త్రం అందజేత, 19న కలెక్టర్‌కు, 20న ఆర్టీసీ డి పో మేనేజర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణ యించారు. 21న ప్రజాప్రతినిధులతో ఆటో యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వ హించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజుయాదవ్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఉమ్మడి జిల్లా సమావేశం

- హాజరుకానున్న సునీల్‌బన్సల్

నిర్మల్: భారతీయ జనతాపార్టీ ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్మల్ పట్టణంలోని భైంసా రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్న గారి భూమయ్య తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షతో పాటు రానున్న పార్లమెంట్ ఎన్నికల సమాయత్తంపై సమావే శం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరవుతారని చె ప్పారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియో జకవర్గాల బాధ్యులు, నాలుగు జిల్లాల బాధ్యు లు హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంఆర్ జాప్యం



సీఎంఆర్ పర్యవేక్షణ తహసీల్దార్లకు అప్పగించిన సమయంలో ఓ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

- ప్రతీ సీజన్‌లోనూ అదే అలసత్వం
- జిల్లాలో తీరు మారని కొందరు మిల్లర్లు
- నిల్వ చేసిన ధాన్యంలోనూ గోల్‌మాల్
- కొత్త సర్కారులోనైనా వారిపై చర్యలు ఉంటాయా?

సీఎంఆర్ వివరాలు (విలువ మెట్రిక్ టన్నుల్లో)

	లక్ష్యం	అప్పగించింది	మిగిలింది
వానాకాలం (2021-22)	91,910	90,691	1,218
యాసంగి (2021-22)	52,649	37,985	14,442
వానాకాలం (2022-23)	80,336	39,406	40,640
యాసంగి (2022-23)	62,086	13,502	48,468



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైతుల నుంచి సేకరిం చిన ధాన్యాన్ని మరాడించి బియ్యంగా సర్కారుకు అప్పగించడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మిల్లర్లపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రతీ సీజన్‌లో వేల క్వింటాళ్ల కొద్దీ ధాన్యాన్ని మిల్ల ర్లకు అప్పగించడం మళ్లీ సకాలంలో బియ్యం పొం దడంలో పౌరసరఫరాల శాఖ విఫలమవుతోంది. నిర్ణీత గడువులోపే బియ్యంగా చేసి ఇవ్వాల్సి ఉన్నా ఒకరిద్దరు తప్పితే అధిక సంఖ్యలో మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. ప్రతీసారి గడువులు పెంచుతూ పోతుండగా ఆ జాప్యంతో నెట్టుకొస్తున్నారు. తాజా గడువు ప్రకారం ఈ నెల 31లోపు బియ్యం అందిం చాలి. ఇప్పటికే పలుమార్లు తేదీలు పొడగించగా.. తాజా గడువులోపు పూర్తవుతుందా..? లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఏటా అదే తీరు..

ప్రతీ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో రైతు ల నుంచి ప్రభుత్వమే మద్దతు ధరతో ధాన్యం కొను గోలు చేసి మిల్లర్లకు అప్పగిస్తోంది. ఆ ధాన్యాన్నే మళ్లీ మిల్లర్లు కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్)గా కేం ద్ర ప్రభుత్వ ఎఫ్‌సీఐకి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు అందిస్తే రేషన్‌గా అందుతాయి. గతంలో జిల్లా పరిధిలో మిల్లులు తక్కువగా ఉండడంతో ధాన్యా న్ని పొరుగున ఉన్న పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాం తాల మిల్లులకు తరలించేవారు. గత రెండేళ్లుగా జిల్లాలో కూడా కొత్తగా మిల్లుల ఏర్పాటుతో సామ ర్థ్యం పెరిగింది. మిల్లుల సంఖ్య 54కు చేరింది. సేక రణ లక్ష్యం కూడా పెరగడంతో నిల్వలకు ఇబ్బందు లు పడాల్సి వస్తోంది. వానాకాలం సీజన్‌లో ధాన్యం మిల్లింగ్ పూర్తి కాకుండా యాసంగి ధాన్యం వస్తుం డడంతో సరిపడా చోటు లేక నిల్వకు ఇబ్బంది పడా ల్సి వస్తోంది. మిల్లర్లు సైతం మరమ్మతులు, విద్యుత్ కోతలు, కూలీలు అందుబాటులో లేకపో వడం, నూకలు అధికంగా రావడం తదితర కార ణాలు చెబుతూ బియ్యం సకాలంలో ఇవ్వడం లేదు. వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్‌మిల్లులకు అందించినా నిర్ణీత గడువులోపు బియ్యం తిరిగి ఇవ్వడం లేదు. కొన్ని మిల్లులు మాత్రమే నిక్కచ్చిగా ఉన్నాయి. తరచూ కలెక్టర్, అదనపు కలెక్టర్ రైస్‌మిల్లర్లతో సమీక్షలు, సమావేశాలు ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఆదేశాలు ఇస్తున్నా ఫలితం ఉండడం లేదు. 2021–22 యాసంగి ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ ఇవ్వకుండా అలసత్వం చేసిన 19 మిల్లులకు రూ.51కోట్ల జరి మానా విధించారు. ఈ జరిమానా తప్పించుకునేం దుకు గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలతో లాబీయిం గ్ చేశారు. గత జూలైలో తహసీల్దార్లకు మిల్లుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. రోజువారీగా నివేదికలు అందజేయాలని ఆదేశాలు ఇచ్చినా పక డ్బందీగా అమలు కావడం లేదు.

ధాన్యం నిల్వల్లో గోల్‌మాల్

జిల్లాలో ఏటేటా ధాన్యం దిగుబడి పెరిగిపో తోంది. వానాకాలం, యాసంగి సీజన్లలో ధా న్యం కొనుగోలు సమయాల్లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు సీఎంఆర్ ఇవ్వని మిల్లులకు కూడా ధాన్యం ఇస్తున్నారు. ఇదే అదనుగా ధాన్యం కటింగ్, ట్రక్ షీట్‌లో అవ కతవకలు, ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వడంలో కొన్ని మిల్లులు అలసత్వం వహిస్తున్నాయి. ఇక కొన్ని మిల్లుల్లో అప్పగించిన ధాన్యం ఉందో లేదో అనే సందేహాలు తలెత్తుతు న్నాయి. ఇద్దరు ముగ్గురు మిల్లర్లు రేషన్ బియ్యాన్నే తిరిగి 'సీఎంఆర్' కింద ఇస్తూ 'పాస్' చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వ ఎఫ్‌సీఐకి మాత్రం బియ్యం పంపడంలో అలసత్వం వహిస్తున్నారు. సీఎంఆర్ జాప్యంపై పౌరస రఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను సంప్రదించ గా, సకాలంలో మిల్లర్లు బియ్యం అందించే లా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ ఉన్న బియ్యం అప్పగించేలా చర్య లు తీసుకున్నామని చెప్పారు.

కొందరికే 'బంధు'వు

- ఆరు రోజులు గడుస్తున్నా ఎకరం దాటని పెట్టుబడి సాయం
- వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- ఇప్పటికే నార్లు పోసుకుని ఎదురుచూస్తున్న రైతులు
- చేతిలో డబ్బులు లేక ఇబ్బంది



మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి సాగుకు పెట్టు బడికి గానూ ప్రభుత్వం రైతుబంధు సాయం ప్రక టించి ఆరు రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఖాతాలో నగదు జమ కాకపోవడంతో రైతులు అటు వ్యవ సాయ అధికారులు, ఇటు బ్యాంకుల చుట్టూ తిరు గుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత పద్ధతిలోనే ఈ విడత ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుబంధు నగదు ఈ నెల 12 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. మొదట గుంటలు, అర ఎకరం, ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే నగదు జమ అయ్యింది. రోజుల వారీగా క్రమేపీ రెండెకరాలు, మూడు, నాలుగైదు ఎకరాల రైతుల వారీగా నగదు జమ చేయాల్సి ఉం ది. కానీ ఆరు రోజులు కావస్తున్నా ఎకరం పైబడిన రైతుల ఖాతాల్లో నగదు ఇంకా జమ కాకపోవడంతో అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడంలేదు.

జిల్లాలో 1,54,589 మంది అర్హులు

జిల్లాలో రైతుబంధు సాయం పొందేందుకు అర్హు లైన రైతులు 1,64,065 మంది ఉండగా రూ.175,09,19,825 నగదు అందాల్సి ఉంది. ఇం దులో మండల వ్యవసాయ అధికారులకు బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, తదితర ధృవీకరణ పత్రా లు అందించిన రైతులు 1,52,589 మంది ఉన్నారు. వీరి ఖాతాల్లో రూ. 168,82,67,906 నగదు జమ కావాల్సి ఉంది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు ప్రారంభించి వానాకాలం, యాసంగి పం టల పెట్టుబడి కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసిం ది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేల నగదు అందజేస్తామని తెలిపింది. కౌలు రైతులకు కూడా రైతుభరోసా కింద నగదు అందజేస్తామని హామీ ఇచ్చింది. పథకంలో మార్పులతో నగదు జమ చేసేందుకు చర్యలు చేపడుతోంది.

ఇప్పటి వరకు 35,343 మందికి..

కౌలు రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లిస్తున్న వారిని గుర్తించడం ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపో వడంతో పాత పద్ధతిలోనే రైతులందరికీ ఈ నెల 12 నుంచి రైతుబంధు సాయం అందజేస్తోంది. ఆరు రోజుల వ్యవధిలో 35,343 మంది రైతులకు రూ.7,58,42,615 నగదు మాత్రమే ఖాతాలో జమ అయ్యింది. ఇప్పటి వరకు ఎకరం వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే నగదు జమ చేశారు. దీం తో ఆపై భూమి ఉన్న రైతులు వ్యవసాయ అధికారు లు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

1.10 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

జిల్లాలో ఈ ఏడాది 1.20 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు విస్తీర్ణం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు వానాకాలంలో సాగు చేసిన వరి, పత్తి పంటలు అమ్ముకున్న రైతు లు యాసంగి సాగుకు శ్రీకారం చుట్టారు. కొంత మంది వరి నారు పోసుకోగా మరి కొంతమంది మొక్కజొన్న, శనగ, తదితర పంటలు వేసుకుంటు న్నారు. ఇప్పటి వరకు 22,500 ఎకరాల్లో వివిధ పం టలు సాగైనట్లు వ్యవసాయ అధికారులు పేర్కొం టున్నారు. జనవరి రెండో వారం వరకు వరి నాట్లు వేసుకునేందుకు గడువు ఉండడంతో రైతులు పంట పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఆలస్యం చేయకుండా వేయాలె

యాసంగి నారు పోసుకొని పంట పెట్టుబడి సాయంకోసం ఎదురుచూస్తున్నా. ఏటా ఇప్పటికే నాట్లు వేసుకునేది. కూలీలకు, ట్రాక్టర్ కిరాయికి పైసలకు తిప్పలు అయి తంది. ఎకరం ఉన్నోళ్లకు పైసలు పడ్డయ్. ఎకరన్నర ఉన్న నాకు ఇంకా పడలే. ఆల స్యం చేయకుండా పైసలు వేయాలె.

– శ్రీనివాస్, కుందారం, జైపూర్

ఇంకా రాలేదు..



నాకు ఎకరం 6 గుంటల భూమి ఉంది. యాసంగి పెట్టుబడి సాయం రైతు బంధు ఇంకా రాలేదు. కొంతమందికి నాలుగు రోజుల కిందటే వచ్చినై. నాకు ఎప్పుడు పడుతయో.. ఏమో. అధికారు లను అడిగితే పడుతాయంటున్నారు.

– ఆకుల కుమార్, రేపల్లెవాడ, తాండూర్

కొందరికే పైసలు పడ్డయ్



నాకు రెండెకరాల నాలు గు గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. అరెకరం , ముప్పావు ఎకరం ఉన్న రైతులకు ఐదు రోజుల కిందటే రైతుబం ధు పైసలు పడ్డయ్. నాకు ఇంకా పడలేదు. ఆలస్యం చేయకుండా వెంటనే వేయాలని కోరుతున్నా.

– భీమరాజుల మల్లేశ్, నెన్నెల

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

- జిల్లా విద్యాధికారి యాదయ్య

దండేపల్లి: విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్తే జీవితంలో అనుకున్నది సాధిస్తారని జిల్లా విద్యా శాఖ అధికారి యాదయ్య అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత విద్యార్థులు ఏయే కోర్సులు చేస్తే ఎలాంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయనే దానిపై వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులచే విద్యార్థు లకు వివరిస్తారన్నారు. ఓ తరగతిగదిలో విద్యార్థుల తో కలిసి కూర్చున్న డీఈవో యాదయ్య ఉపాధ్యా యుడు బోధించే తీరును పరిశీలించారు. కార్యక్ర మంలో సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంపీడీవో మల్లేశం, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యుడు సతీశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, తదిత రులు పాల్గొన్నారు.

ప్రయోజకులు కావాలి

భీమారం: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవి తంలో ఏంసాధించాలో చిన్నతనంలోనే నిర్ణయించు కోవాలన్నారు. ఆ మేరకు కష్టపడి చదివితే సాధించ లేనిది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వంబర్, ఎస్సై రాజవర్ధన్, మెడికల్ ఆఫీసర్ అనీల్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎం విక్రమ్ పాల్గొన్నారు.



దండేపల్లి: మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ధనుర్మాసం.. ఆధ్యాత్మికం

- నేటి నుంచి విశ్వనాథస్వామి ఆలయంలో ఉత్సవాలు



విశ్వనాథస్వామి ఆలయం

మంచిర్యాలఅర్బన్: ధనుర్మాసం ఆధ్యాత్మికంగా ప్రసిద్ధమైంది. సూర్యుడు ధనస్సురాశిలో సంచరిం చే పుణ్యకాలమిది. ఈ మాసంలో తెల్లవారు జామున తీర్థస్నానాలు ఆచరించి దైవారాధన, ప్రద క్షిణ చేయడం ఆచారం. ఈ నెల 17 నుంచి ధను ర్మాసం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్థానిక విశ్వనాథస్వామి ఆలయంలో నేటి నుంచి జనవరి 14 వరకు 30 రోజుల పాటు ధనుర్మాస ఉత్స వాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 23న శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం వైకుంఠ దర్శన అనంతరం అర్చన, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. జనవరి 5 నుంచి 10 వరకు ఆండాళ్ అమ్మవారికి ప్రతిరోజు 10:30 గం టలకు అభిషేకం, జనవరి 5న ఉదయం 10:30 గం టలకు గోదాదేవి మంజిలి ఉత్సవం, 14న గోదారం గనాథ స్వామి కల్యాణం జరుపనున్నారు.

సకల అభీష్టాలు నెరవేరుతాయి



ధనుర్మాస వ్రతాలు శ్రద్ధతో ఆచ రించే వారి సకల అభీ ష్టాలు నెరవేరుతాయి. ఈ మాసంలో సాత్వికాహారం తీసుకుంటూ దీక్షలు చేపట్టాలి. వైష్ణవ క్షేత్రా ల్లో స్వా మి వారి వైకుంఠ ద్వారదర్శనంతో జన్మ జన్మల పుణ్యఫలితం దక్కుతుంది.

– భట్టాచార్యులు, ఆలయ అర్చకుడు

'బీసీ జన గణన చేపట్టాలి'

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ జన గణన చేపట్టాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షు డు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సీసీసీ కార్నర్ చౌరస్తా వద్ద కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల పక్షపాతిగా చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం వెం టనే బీసీ జన గణన చేపట్టని పక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకన్న, వేముల కిరణ్, తోకల వెంకటేశ్ పాల్గొన్నారు.

గోల్డ్‌మెడలిస్ట్ వెంకటస్వామి

- బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు
- కోలిండియా స్థాయి క్రీడల్లో ప్రతిభ
- నాలుగుసార్లు సింగరేణిలో..
- యువ ఉద్యోగులకు ఆదర్శం

సండే స్పెషల్

మందమర్రిరూరల్: బాడీ బిల్డింగ్ పోటీల్లో బంగారు పతకాలతో బత్తుల వెంకటస్వా మి విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. కోలిం డియా స్థాయి పోటీల్లో రాణిస్తూ సింగరేణి లోని మందమర్రి ఏరియాకు దేశవ్యాప్తం గా ప్రత్యేక గుర్తింపు తెచ్చాడు. మందమర్రి ఏరియాలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో ఫోర్‌మెన్ గా బత్తుల వెంకటస్వామి విధులు నిర్వర్తిస్తు న్నాడు. ఈ నెల 4 నుంచి 6వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన కోలిండియా బాడీ బిల్డింగ్ (90 కిలోల విభాగం) పోటీల్లో బంగారు పతకం సాధించి సింగరేణి పేరు దేశవ్యాప్తంగా మారుమో గించాడు. వెంకటస్వామి 2006లో సింగరేణి ఎక్స్ టర్నల్ ఎలక్ట్రీషియన్ పరీక్షలు ఉత్తీర్ణుడై ఎలక్ట్రీ షియన్‌గా విధుల్లో చేరాడు. 2013లో డిపార్టుమెం టల్ పరీక్షలు ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ పాసయ్యాడు. వ్యాయామంపై ఆసక్తితో జిమ్‌లో చేరాడు. ప్రతీరోజు రెండున్నర, మూడు గంటల వరకు సాధన చేశాడు. బాడీ బిల్డింగ్ పోటీలపై మక్కువ పెంచుకున్నాడు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిం చే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ సింగరేణి స్థాయిలో ఐదేళ్లుగా రానిస్తున్నాడు.



వెంకటస్వామిని సన్మానిస్తున్న ఏరియా జీఎం మనోహర్, ఏరియా అధికారులు



ప్రదర్శనలో వెంకటస్వామి

సాధించిన పతకాలు

ప్రతీ సంవత్సరం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో సింగరేణిలో నిర్వహించే బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొంటున్నాడు. 2018–19, 2019–20, 2020–21, 2022–23 సంవత్సరాల్లో నిర్వ హించిన పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. కోలిండియా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సింగరేణి తరఫున 2019లో మధ్యప్రదేశ్‌లోని సింగ్రోళిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని కాం స్య పతకం, 2020లో మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నిర్వహించిన కోలిండియా పోటీల్లో కాం స్య పతకం, 2022లో పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కత్తాలో నిర్వహించిన పోటీల్లో వెండి పతకం అందుకున్నాడు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం సాధించి దేశవ్యాప్తం గా మందమర్రి ఏరియాకు గుర్తింపు తెచ్చాడు. ఉరుకులు పరుగుల జీవితంలో బిజీ బిజీగా ఉండే యువతకు వెంకటస్వామి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఏదైనా సాధించాలనే తపన ఉం టే సాధనతో సమాజంలో గుర్తింపు వచ్చే విధంగా తయారవుతారని నిరూపిస్తున్నాడు.

ప్రతీ ఏరియాలో జిమ్ ఏర్పాటు చేయాలి

బంగారు పతకం సాధించడంలో సింగరేణి యాజమాన్యం ప్రోత్సా హం బాగుంది. పోటీలకు వెళ్లే ముందు ప్రత్యేకంగా మరికొంత సమయం ఇస్తే బాగుంటుంది. యాజమాన్యం మరింత సహకరించి ప్రోత్సహిస్తే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా. సింగరేణిలో యువ ఉద్యోగులు సుమారు 20 వేల మందికి పైగానే ఉన్నారు. ఫిట్‌నెస్ కోసం సింగరేణి వ్యాప్తంగా ప్రతీ ఏరియాలో జిమ్ ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన కోచ్‌లను నియమించాలి. యువ ఉద్యోగులు ప్రతీరోజు జిమ్‌కు వెళ్లడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతో పాటు విధు లకు గైర్హాజర్ కాకుండా హాజరై సంస్థ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిలో పాలుపంచుకుంటారు.

– వెంకటస్వామి, కోలిండియా గోల్డ్ మెడలిస్ట్

అభినందనీయం...

మందమర్రి ఏరియాలో ఎలక్ట్రి కల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వ ర్తించే వెంకటస్వామికి కోలిం డియా పోటీల్లో గోల్డ్‌మెడల్ రావడం అభినందనీయం. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెంది మరెన్నో గోల్డ్‌మెడల్స్ సాధించాలి. అందుకు సింగరేణి ప్రోత్సాహం ఉంటుంది.

– మనోహర్, ఏరియా జీఎం

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


మదావి ఇస్రు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి గోండుగూడకు చెందిన మడావి ఇస్రు కొన్ని రోజులుగా అదృశ్యమైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అక్టోబర్ 10న ఇంట్లో నుంచి కూలీ పని కోసం వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. కుటుంబీకులు బంధువుల ఇళ్లు, ఇతర పట్టణాల్లో పరిశీలించిన అనంతరం శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్‌నంబరు 87126 56547కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రేపు వాహనాల బహిరంగ వేలం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 18న వాహనాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన 12 ద్విచక్రవాహనాలకు ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు వాహన విలువలో 50 శాతం ఈఎండీ చెల్లించాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

60వ సారి ఉపాధ్యాయుడి రక్తదానం


రక్తదానం చేస్తున్న బాబ్జీ

కాసిపేట: ఎన్నో మార్లు రక్తదానం చేయడంతోపాటు రక్తదానం చేయిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఈ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. మండలంలోని ట్యాంక్‌బస్తీకి చెందిన చొప్పదండి బాబ్జీ నెన్నెల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శనివారం 60వ సారి మంచిర్యాలలోని వాలంటరీ బ్లడ్‌బ్యాంక్‌లో స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈనెల 30న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. కోర్టు ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించినందుకు జిల్లాలో ప్రథమస్థానం లభించిందన్నారు. అనంతరం జడ్జి, సీనియర్ న్యాయవాది శ్రీధర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ పాల్గొన్నారు.

18న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 18వ తేదీన జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ శనివారం తెలిపారు. అండర్-20, 18, 16 బాలబాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికైనవారు 23న కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

గెలుపు నిర్ణేత శ్రీరాంపూర్

- శ్రీరాంపూర్ ఓట్లే కీలకం
- 25 శాతం ఓటర్లు ఇక్కడే
- మిగతా ఓట్లు 10 ఏరియాల్లో
- ఇక్కడ లీడ్ వస్తేనే సింగరేణి కైవసం

సింగరేణి ఓటర్ల వివరాలు..

ఏరియా	ఓటర్లు
బెల్లంపల్లి	985
మందమర్రి	4876
శ్రీరాంపూర్	9124
కార్పొరేట్	1192
కొత్తగూడెం	2370
మణుగూరు	2414
ఎల్లందు	603
నైనీ	2
భూపాలపల్లి	5350
ఆర్జీ 1	5430
ఆర్జీ 2	3479
అడ్రియాల	944
ఆర్జీ 3	3063
మొత్తం	39748



శ్రీరాంపూర్ డివిజన్ ముఖ ద్వారం

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ల గెలుపోటములను శ్రీరాంపూర్ ఏరియానే నిర్దేశించనుంది. ఈ ఏరియాలో ఉన్న అధిక శాతం ఓటర్లపైనే యూనియన్ల భవితవ్యం ఆధారపడి ఉంది. ఇక్కడ అధిక ఓట్లను కైవసం చేసుకుంటేనే సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచే అవకాశం ఉంటుంది. దీంతో ప్రధాన కార్మిక సంఘాలన్నీ శ్రీరాంపూర్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. కంపెనీ వ్యాప్తంగా 11 ఏరియాలతోపాటు నైనీబ్లాక్, అడ్రియాల ప్రాజెక్టులు కలిపి మొత్తం 39,748 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒక్క శ్రీరాంపూర్‌లోనే 9,124 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓట్లలో మెజారిటీ ఓట్లు తమ వైపునకు మళ్లించుకుంటే మిగతా ఏరియాల్లో హెచ్చుతగ్గులున్నా గెలుపు మాత్రం ఖాయంగా ఉంటుంది. గత 6వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికల్లో శ్రీరాంపూర్‌లోనే టీబీజీకేఎస్ 2,243 ఓట్ల మెజార్టీని ఇక్కడ సొంతం చేసుకోవడంతోనే సింగరేణిలో విజయవకేతనం ఎగురవేసింది. నాటి ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు 6,189 ఓట్లు, ఏఐటీయూసీకి 3,946 ఓట్లు వచ్చాయి.

ఇక్కడే మకాం వేసిన నేతలు..

ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీఏఎస్, హెచ్ఎమ్మెస్, బీఎంఎస్, సీఐటీయూతోపాటు విప్లవ కార్మిక సంఘాల కూటమి సైతం ఇక్కడి ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య కొంతకాలంగా ఇక్కడే తిష్టవేసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. శ్రీరాంపూర్‌లో వీలైనన్ని ఎక్కువ ఓట్లు రాబట్టుకోవాలనే ఉద్దేశ్యంతో క్యాడర్‌ను సమీకరించడం చేస్తున్నారు. ఆయన నిత్యం ఏదో ఒక గనిపై ప్రచారం చేసే మిగతా షిఫ్టులో ఇతర ఏరియాలకు వెళ్తున్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ కూడా స్థానికంగా రసూల్‌పల్లెలో నివాసం ఉండడంతో ఆయన నిత్యం స్థానిక నేతలు, కార్మికులను కలుస్తూ ఈ ఏరియాలోనే వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఇతర సంఘాల నుంచి తమ సంఘంలో చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇక బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డిలు కూడా శ్రీరాంపూర్ గనులను చుట్టివస్తున్నారు. హెచ్ఎమ్మెస్ డివిజన్ నేతలు కూడా తమ తమ రీతిలో ప్రచారం చేస్తున్నారు. ఇక ప్రస్తుత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌లో మాత్రం అనిశ్చిత నెలకొంది. ఎన్నికలపై నాయకత్వం నుంచి సరైన దిశానిర్దేశం లేకపోవడంతో గత నాలుగు రోజులుగా గనులపై ప్రచారాలు కూడా నిలిచిపోయాయి.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

శ్రీరాంపూర్: సింగరేణి డేను పురస్కరించుకుని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. జీఎం కార్యాలయం ముందున్న సెంట్రల్ నర్సరీలో పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన పోటీలను ఏరియా ఇంచార్జీ జీఎం రఘుకుమార్ ప్రారంభించారు. వాలీబాల్, త్రోబాల్ తదితర పోటీల్లో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నారు. ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందర్‌రావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏజెంట్ ఏవీ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి ఉన్నారు.

'కొత్త బావులు తెస్తాం'


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో గెలిస్తే కొత్త భూగర్భగనులు తీసుకొస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శనివారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో కొత్తగనులు రాక ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్యం, బస్తీలో దవఖానాల సౌకర్యం, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. కంపెనీ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాజుయాదవ్, రమేష్, కొంపల్లి తిరుపతి, దొంతుల రాజేంద్రప్రసాద్, మోతే ఓదెలు, ప్రభాకర్ ఆనందరావు పాల్గొన్నారు.

'అవకాశమిస్తే హక్కులు సాధిస్తాం'


మాట్లాడుతున్న నాగరాజ్ గోపాల్

శ్రీరాంపూర్: సింగరేణిలో అవకాశం ఇచ్చి గెలిపిస్తే హక్కులు సాధిస్తామని సీఐటీయూ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ తెలిపారు. శనివారం ఎస్ఆర్పీ 3,3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సింగరేణిలోని సంఘాల నేతలు ప్రభుత్వ సంఘాల్లో చేరుతున్నారని అన్నారు. ఇప్పటివరకు గెలిచిన సంఘాలు చేసిన కొన్ని ఒప్పందాలు వన్‌టైం సెటిల్మెంట్ కింద చేశారని, దీని వల్ల కార్మికులు తరచూ ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. పక్కనే గోదావరి ఉన్నా కార్మిక కుటుంబాలకు పరిశుభ్రమైన నీటిని ఇప్పించలేని గుర్తింపు సంఘాలను ఓడించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు చీకట్ల సాగర్, అజయ్ సాయి, శ్రీనివాస్, సదానందం, ఇప్ప నరేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై యాత్ర


ప్రచార రథం వద్ద మనోజ్ శక్తి

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నట్లు మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ జాయింట్ సెక్రెటరీ మనోజ్ శక్తి తెలిపారు. శనివారం జిల్లాలో సంకల్ప్ యాత్ర ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం, హాజీపూర్ మండలం వేంపల్లి, భీమారం మండలం పోలంపల్లి, మందమర్రి మండలం బొక్కలగుట్టలలో కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. ఇదే తరహాలో జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, జీవన్‌జ్యోతి బీమా, సురక్ష బీమా తదితర పథకాలపై ప్రచారం నిర్వహిస్తామని, వచ్చే జనవరి 26న గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు, జెడ్పీ సీఈవో నరేందర్, కృషి విజ్ఞాన్ కేంద్ర సమన్వయకర్త తదితరులు పాల్గొన్నారు.

ఠాణా ఎదుట శేజల్ నిరసన

తాండూర్: స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ఆరిజిన్ డైయిరీ సీఏవో బోడపాటి శేజల్ శనివారం నిరసన వ్యక్తం చేసింది. గతేడాది తాండూర్ పోలీసులు తనపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించింది. తాండూర్ మండలానికి చెందిన రంగారావు, సతీష్‌రావు, హరిప్రియ, కుమ్మరి పోషం, చిల్లర సంతోష్ తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొంది. పోలీసులు ఏకపక్ష విచారణతో కేసుల్లో ఇరికించారని ఆరోపించింది. డెయిరీ నిర్వహణలో భాగంగా రైతులకు రూ.10 లక్షల విలువైన ఎనిమిది ఆవులు, రెండు గేదెలు ఇచ్చినట్లు తెలిపింది. తాజాగా తన ఫిర్యాదు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపింది. కాగా, ఈవిషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. శేజల్ ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం కేసు నమోదు చేశామని, మళ్లీ అదే సమస్యపై రెండోసారి ఫిర్యాదు చేయడానికి వచ్చారని పేర్కొన్నారు. ఒకే అంశంపై రెండు ఫిర్యాదులు చేస్తే కేసు నమోదు చేయడం కుదరని తెలిపారు.

క్రీడాకారులకు మంచి భవిష్యత్



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: విద్యార్థి దశ నుంచే ఆటల్లో ప్రావీణ్యం సంపాదించే క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలను సీఐ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ యుగంలో చదువుతోపాటు ఆటలపై ఆసక్తి చూపే విద్యార్థులను అభినందించాలని అన్నారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు మంచి ప్రతిభ కనబర్చాలని తెలిపారు. సింగరేణి సామాజిక బాధ్యతతో పరిసర ప్రాంత ప్రజలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి 21 జట్లు పాల్గొనగా.. విజేతకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు ఉంటుందని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా పీఎం శ్యాంసుందర్, కోచ్‌లు అరవింద్, రాజలింగు, శేఖర్, గౌరమ్మ, సభ్యులు ఆర్.వెంకటేశ్వర్లు, సంజయ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు చదరంగం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. ఈ నెల 15న బెల్లంపల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి పోటీలో విద్యార్థులు శ్రీహర్షిణి, మల్లేశ్వరి, రాజహంస ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

18న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జట్ల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మైదానానికి చేరుకుని పీఈటీ సదానందంకు రిపోర్టు చేయాలని సూచించారు.

'ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'


మాట్లాడుతున్న కాంపెల్లి సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో ఐఎన్‌టీయూసీని గెలిస్తే ప్రైవేటీకరణ అడ్డుకుంటామని యూనియన్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5, ఆర్కే 6, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనులపై యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సింగరేణి గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని చూస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కు కావడం వల్ల ఇప్పటికే కొన్ని గనులు ప్రైవేటు సంస్థల పరం అయ్యాయని తెలిపారు. ఆయా గనులపై పలువురు కార్మికులు, ఇతర సంఘాల చెందినవారు యూనియన్‌లో చేరారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యామ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర కార్యదర్శులు లాగల శ్రీనివాస్, సమ్ము రాజయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు తిరుపతి రాజు, నాయకులు భీం రవి, రామచందర్, శీలం చిన్నయ్య పాల్గొన్నారు.

'అలవెన్స్‌లపై ఆదాయ పన్ను మాఫీ'


ఏఐటీయూసీలో చేరిన వర్క్‌షాప్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: తాము గుర్తింపు సంఘం గెలిస్తే అలవెన్స్‌లపై ఆదాయ పన్ను మాఫీ చేయిస్తామని, యజమాన్యం చెల్లించే విధంగా ఒప్పందం చేస్తామని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీ.వీరభద్రయ్య, బ్రాంచీ కార్యదర్శి ఎస్కె.బాజీసైదా తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లలో యూనియన్ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోలిండియాలో అమలవుతున్నా సింగరేణిలో అమలుకు కాకపోవడానికి గత గుర్తింపు సంఘం వైఫల్యమేనని అన్నారు. వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళా కార్మికులు, కార్మికులు యూనియన్‌లో చేరారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు రాచర్ల చంద్రమోహన్, ఎస్.మల్లేష్, మారుపాక సారయ్య, అఫ్రోజ్‌ఖాన్, రామచందర్, సదానందం, మురళీచౌదరి, గునిగంటి నరసింగరావు, మోహన్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

న్యూమోనియా నివారణకు చర్యలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: చిన్నారుల్లో న్యూమోనియా లక్షణాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం వైద్యులు, సిబ్బందికి సాన్స్ క్యాంపెయిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 29 వరకు జిల్లాలో సాన్స్ (సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ ప్లాన్ టు న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సెస్‌ఫుల్లి) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, జ్వరం న్యూమోనియా లక్షణాలని, నివారణలో భాగంగా చిన్నారులను వెచ్చని వస్త్రంతో కప్పి ఉంచాలన్నారు. ఇది సోకకుండా ఉండేందుకు చిన్నారులకు 3 డోసుల న్యూమోకాల్ వ్యాక్సిన్ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్నెల్లు నదీవాసమే!

- వలస బాటలో గంగపుత్రులు
- శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదని ఆవేదన


ప్రాణహిత నదిలో నిర్మించుకున్న గుడారాలు


ఎడ్లబండిలో పడవను తీసుకెళ్తున్న జాలర్లు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండల కేంద్రంతో పాటు కల్మలపేటకు చెందిన గంగపుత్రులు సుమారు 240 కుటుంబాలు ఇల్లు, వాకిలి వదిలి చేపల వేటకు వలసబాట పడుతున్నారు. కొందరు ప్రాణహిత నదికి, మరికొందరు గోదావరినదికి వెళ్తున్నారు. డిసెంబర్‌లో వెళ్లి మే మాసం చివరి వరకు అక్కడే ఉంటారు. మడుగుల వద్ద వేసుకున్న గుడారాలే వారికి ఆవాసాలు. ఇసుక తిన్నెలే పడకపాన్పులు. రాత్రంతా చల్లని గాలులు, పగలంతా ఎండవేడిమికి తట్టుకుంటూ నదిలోనే ఉండిపోతారు. రాత్రి, పగలు తేడా లేకుండా చేపల వేట సాగిస్తారు. ఇప్పటికే ఎడ్లబండ్లు , ప్రైవేట్ వాహనాల్లో పడవలు, వలలు వంట సామగ్రి తరలించారు.

చిక్కని చేపలు

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాణహిత, సింగిరేవుబండ, పాయిరాల మడుగుల వద్ద రేగుంట, రాచర్ల మడుగులు, కళ్లెంపల్లి, కర్జెల్లి మడుగుల వద్ద, దూర ప్రాంతమైన గోదావరినది, సోమన్‌పల్లి, ఎల్మడుగు, గోదావరిఖని, గొల్లవాగు ప్రాజెక్టుల వద్ద నివాసం ఉంటున్నారు. భారీ వర్షాల కారణంగా మడుగులు అంతర్ధానమయ్యాయి. నదిలో నాచు, లబ్బగడ్డి ఎక్కువై వేసిన వలలు లాగడం ఇబ్బందిగా మారుతోంది. చేపలకు ఆవాసమైన మడుగులు లేక దిగువకు వెళ్లిపోయినట్లు జాలర్లు తెలుపుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడుతున్నా శ్రమకు తగిన ఫలితం లభించడం లేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ప్రయాణంలో మహిళలే అధికం


మంచిర్యాల బస్‌స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికులే ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈ నెల 9నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రాగా.. శుక్రవారం జీరో టికెట్ అమల్లోకి తెచ్చారు. డిపో పరిధిలోని 93 పల్లెవెలుగు, 22 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ప్రయాణించగా జీరో టికెట్ జారీ చేశారు. మొత్తం 51వేలకు పైగా ప్రయాణించగా ఒక్కరోజులోనే మహిళలు 36,650 మంది ప్రయాణం చేశారు. ఈ లెక్కన పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నారు. చెన్నూర్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రూట్లలో ప్రయాణించే మహిళల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉచిత ప్రయాణానికి అనుమతించిన ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం నుంచి ఎంతమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారో లెక్క తేల్చేందుకు జీరో టికెట్‌ను అమలు చేస్తోంది. ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. జీరో టికెట్ ఇస్తున్నందున ప్రయాణికులు తెలంగాణ ప్రాంతమా..? ఇతర ప్రాంతాలకు చెందిన వారా అనేది తెలుసుకునేందుకు గుర్తింపుకార్డు చూపించాలని మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు.